క్లుప్తంగా

ప్రజాధనంతో విహార యాత్రలు సరికాదు

సీతమ్మధార: ప్రజలు కడుతున్న పన్నులతో కార్పొరేటర్లు, అధికారులు విహార యాత్రలు చేయడం వల్ల ఒరిగేదేమీ లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజల నుండి వసూలు చేసిన చెత్త పన్ను సుమారు రూ. 3 కోట్లు కార్యదర్శులు జమ చేయకపోతే ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని మండిపడ్డారు. తీరా ఇప్పుడు పత్రికల్లో వార్తలు వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ ప్రధాన అధికారి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మొత్తం ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ఇందుకు కారణమైన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని పైడిరాజు డిమాండ్ చేశారు.

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సందర్శన



జీఎస్‌ఐని సందర్శించిన విద్యార్థులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విద్యార్థులు శుక్రవారం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాను సందర్శించారు. ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా భౌతిక శాస్త్ర అధ్యయనం, భౌగోళిక శాస్త్ర అధ్యయనం ద్వారా విద్యార్థులకు కలిగే ఉపాధి అవకాశాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీఎస్‌ఐ డిప్యూటీ డైరెక్టర్ సుజిత్‌కుమార్ త్రిపాఠి, డాక్టర్ డిభాన్షు బెనర్జీ, రవి గొర్లె, విజయ దుర్గరాజు, శోభన్‌కుమార్ రాయ్, కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పీఎల్ శశి, డాక్టర్ బి.హైమావతి, డాక్టర్ ఎస్. కిరణ్మయి, కె.సత్యనాగ, శ్రావణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలు వినియోగించుకోండి



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి కిరణ్

అల్లిపురం: సచివాలయాల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని గౌరీవీధి సచివాలయం అడ్మిన్ కార్యదర్శి కిరణ్ తెలిపారు. శుక్రవారం ఆయన సచివాలయంలో లబ్ధిదారులకు సచివాలయం ద్వారా అందించే సేవల గురించి వివరించారు. బర్త్ సర్టిఫికెట్, క్యాస్ట్, ఇన్‌కమ్ వంటి పత్రాలను సచివాలయాల ద్వారా పొందవచ్చని, విద్యార్థులు అవసరం నిమిత్తం వాటిని త్వరితగతిన పొందవచ్చని వారికి వివరించారు. కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు కార్యదర్శి జాన్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పైడా కృష్ణప్రసాద్

డాబాగార్డెన్స్: విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ తెలిపారు. పైడా డిగ్రీ కళాశాల 2024–25 ఫ్రెషర్స్‌డే వేడుకలు శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ఉన్నత లక్ష్యాల వైపు విద్యార్థులు నడవాలన్నారు. చదువుతో పాటు క్రీడలు, కళారంగం, వ్యక్తిగత నైపుణ్యం ఎప్పటికప్పుడు పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సరోజ్ మాట్లాడుతూ విద్యార్థులు దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, క్రికెట్, ప్రత్యేక వంటకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

77 వసంతాల వేడుక



గౌరీ పరమేశ్వరులు



ఉత్సవాలకు సిద్ధమవుతున్న, వేంకటేశ్వరమెట్ట వెంకట గౌరీ శంకర గ్రంథాలయం



అమ్మవారి ఉత్సవాలకు ఏర్పాటు చేసిన చలువ పందిరి

- వేంకటేశ్వరమెట్టపై గౌరీ పరమేశ్వరుల ఉత్సవం
- ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు
- నెల రోజుల పాటు ఆధ్యాత్మికతకు ఆలవాలం
- నేటి నుంచి నవంబర్ 23 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

వేంకటేశ్వరమెట్ట 77 వసంతాల గౌరీపరమేశ్వరుల వేడుకలకు సిద్ధమవుతుంది. ఈ మేరకు ఇప్పటికే చలువ పందిళ్లు, మండపాలు ముస్తాబయ్యాయి. ప్రతి ఏడాది దీపావళికి వారం రోజుల ముందుగా గౌరీ పరమేశ్వరులను అంగరంగ వైభవంగా తోడ్కొని వచ్చి నెల రోజుల పాటు అమ్మవారికి పూజలు నిర్వహించడం పరిపాటి. అమ్మవారిని వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో బృందావన్ జంక్షన్‌లో గల సతకం పట్టు నుంచి తిరువీధిగా తీసుకొస్తారు. అప్పటి నుంచి కార్తీకమాసం ప్రతి సోమవారం, కార్తీక పౌర్ణమితో పాటు గౌరీ పరమేశ్వరుల కల్యాణోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

అల్లిపురం: వేంకటేశ్వరమెట్టపై చిన్న భజన కార్యక్రమంతో 1957లో ప్రారంభమైన గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఇంతింతై వటుడింతై అన్నట్లు అమ్మవారి ఉత్సవం అంబరాన్ని తాకే విధంగా ఉత్సవ నిర్వాహకులు, గౌరీ సేవా సంఘం, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం నిర్వహిస్తున్నాయి. అనకాపల్లి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం తర్వాత అంతటి స్థాయిలో ఉత్సవాలు నిర్వహిస్తారని చెప్పవచ్చు. ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా అమ్మవారి తిరువీధి ఉత్సవం విశేషంగా నిర్వహిస్తారు. అమ్మవారిని ప్రత్యేక పూలరథంలో అల్లిపురం, వేంకటేశ్వరమెట్ట, మెయిన్‌రోడ్డు, బంగారుమెట్ట, మార్కెట్ రోడ్డు, నీలమ్మ వేప చెట్టు తదితర ప్రాంతాల్లో ఉత్సవం నిర్వహిస్తారు.

నిత్యం అన్నసమారాధన..

ఉత్సవం కార్తీక మాసంలో జరగుతుండడంతో ప్రతి ఏడాది గౌరీ పరమేశ్వరుల ఉత్సవంలో భాగంగా భవానీలు, అయ్యప్ప స్వాములకు నిత్యం అన్నసమారాధన నిర్వహించడం ఇక్కడ విశేషం. దీంతో నగరంలో ఎక్కడెక్కడి నుంచో స్వాములు, భవానీలు వచ్చి అన్నప్రసాదం స్వీకరిస్తారు. ఈ కార్యక్రమంలో స్థానికులు స్వచ్ఛందంగా పాల్గొని సేవ చేయడం విశేషం.

ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు..



ఈ ఏడాది 77వ వసంతోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 26వ తేదీ నుంచి నవంబర్ 23వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రతి రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం.

– పొలమరశెట్టి శ్యామ్‌కుమార్, అధ్యక్షుడు, గౌరీ సేవా సంఘం

ఉత్సవాల నిర్వహణ అదృష్టంగా భావిస్తాం..



1957 నుంచి అల్లిపురం వెంకటేశ్వరమెట్ట పై గౌరీ పరమేశ్వరుల ఉత్సవం నిర్వహిస్తున్నాం. ప్రతి ఏడాది ఒక విశేషం ఉంటుంది. మా పూర్వీకుల సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం. భావితరాలకు మన సంస్కృతిని అందించడమే ప్రధాన ఉద్దేశం. అమ్మవారిని ప్రతి ఏడాది తెచ్చుకోవడం అదృష్టంగా భావిస్తాం.

– పీల వెంకట అప్పలనాయుడు, అల్లిపురం

మహిళల సౌభాగ్యం



అమ్మవారిని కొలుచుకోవడం మహిళలంతా సౌభాగ్యంగా భావిస్తారు. అమ్మవారికి నిష్టతో పూజలు చేయడం పాత తరాల నుంచి వస్తుంది, అమ్మవారిని మా ఇంటి ఆడపడుచులా చూస్తాం. ఆమెకు ప్రతి రోజు సపర్యలు చేస్తాం. ఏడాదంతా మమ్మల్ని, మా కుటుంబాలని, రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచాలని కోరుకుంటాం.

– శరగడం మణి, అల్లిపురం

77 ఏళ్లుగా ఉత్సవాలు చేస్తున్నాం..



ప్రతి ఏడాది అమ్మవారి ఉత్సవాలు చేయడం ఆనవాయితీ. 77 ఏళ్లుగా ఇలానే కొనసాగిస్తున్నాం. ఇదిలాగే కొనసాగుతుంది. అమ్మవారిని మా ఆడపడుచుగా భావిస్తాం. అమ్మవారిని మా ప్రాంతానికి తీసుకొచ్చిన దగ్గర నుంచి అమ్మవారిని కొలుచుకోవడం, ఉదయం సాయత్రం భక్తి పాటలతో ఈ ప్రాంతం భక్తిభావంతో వర్ధిల్లుతుంది.

– భీశెట్టి దేవి, వేంకటేశ్వరమెట్ట

సైబర్ సెక్యూరిటీపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, క్రైమ్ ఇన్విస్టిగేషన్ విభాగం (సీఐడీ) సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అండ్ సేఫ్టీ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు జరగకుండా డిజిటల్ టెక్నాలజీని సరైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలంటే సైబర్ క్రైమ్‌పై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. సీఐడీ రీజనల్ ఆఫీసర్ డాక్టర్ ప్రేమ్ కాజల్, ఐవోపీ వి. గోపీనాథ్, ఎస్సై పి. చంద్రశేఖర్, బీవీజీ ప్రసాద్, జీవీ రమణ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డి. అరుణపద్మ, డాక్టర్ కె. శిరీష, డాక్టర్ ఆర్. కిరణ్మయి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రీసెర్చ్ ఫండింగ్‌పై వర్క్‌షాప్

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో రీసెర్చ్ ఫండింగ్ అంశంపై అధ్యాపకులు, పీజీ విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ పరిశోధన అనేది విద్యా వ్యవస్థలో ప్రధాన భాగమని, పుస్తకాలు చదవడమే కాక పరిశోధన ద్వారా విషయాలపై లోతైన అవగాహన పొందొచ్చన్నారు. ఈ వర్క్‌షాప్‌కు రీసోర్స్ పర్సన్‌గా బయోటెక్నాలజీ అధ్యాపకుడు డాక్టర్ ఎం. ప్రదీప్‌కుమార్ (శ్రీకాకుళం) పాల్గొని రీసెర్చ్‌లో నిర్వహించే ప్రాజెక్ట్స్, వర్క్‌షాప్‌నకు కావల్సిన ఆర్థిక సహకారం, అందించే ఫండింగ్ ఏజెన్సీల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, అధ్యాపక బృందం, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల సంక్షేమమే ధ్యేయం

సీతమ్మధార: నిరాశ్రయుల సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని జీవీఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి కోరారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ–ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహాన్ని సందర్శించారు. రోడ్లపై తిరిగే నిరాశ్రయులు, అనాథలను రెస్క్యూ ద్వారా వసతిగృహాలకు తరలించాలని సూచించారు. మానసిక రోగులకు అందిస్తున్న చికిత్స గురించి శ్రద్ధా ఫౌండేషన్ బృందంతో చర్చించారు. అలాగే ఇక్కడి నిరాశ్రయులైన పురుషులు, మహిళల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కాగా వసతి గృహంలో మంచినీటి సమస్య ఉందని సిబ్బంది ఆమె దృష్టికి తీసుకురాగా, మంచినీటి సరఫరా విభాగం ఇంజినీర్ల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఆమె వసతిగృహం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

కేజీహెచ్ ప్రధాన ద్వారం వద్ద ఇనుప చువ్వలు బయటికి వచ్చి ప్రమాదకరంగా మారాయి. శుక్రవారం వాటిని గమనించని ఒక మహిళ చువ్వలు చీరకు చిక్కుకోవడంతో కింద పడింది. దాంతో ఆమెకు మరో మహిళ చెయ్యి అందించి సాయం చేసింది.

ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



కుటుంబం చెంతకు అభాగ్యులు

సీతమ్మధార: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయగడ జిల్లాలోని ఘనఘర్‌డిప దరి శంకర్‌నగర్ గ్రామానికి చెందిన చగన్‌యాదవ్ అలియాస్ జితేంద్ర ప్రసాద్ మతిస్థిమితం కోల్పోయి నాలుగేళ్ల క్రితం ఇంట్లో నుంచి పారిపోయి విశాఖ వచ్చేశాడు. ఏయూటీడీ సిబ్బంది రెస్క్యూ ద్వారా ఇతన్ని చిన వాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. ఇతనికి మానసిక వ్యాధి నయం కావడంతో శ్రద్ధా ఫౌండేషన్ ద్వారా కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇతని అన్నయ్య రాజేష్ జుమ్మూలోను, సోదరి రాయ్‌పూర్‌లో అత్తవారింట్లో ఉంటున్నారు. జితేంద్ర ప్రసాద్ సోదరుడికి ఫోన్ చేయడంతో అతని సూచన మేరకు శ్రద్ధా ఫౌండేషన్ సిబ్బంది శుక్రవారం అతన్ని పిన్ని అనంతబాయ్ యాదవ్‌కి అప్పగించారు.

అనాథాశ్రమానికి అభాగ్యుడు..

ఇదొక హృదయవిదారక గాథ. మానసిక వ్యాధి నుంచి కోలుకున్న వ్యక్తిని వసతిగృహం సిబ్బంది కుటుంబ సభ్యుల చెంతకు చేర్చగా ఇంట్లోకి రానివ్వకుంటే ఆశ్రమంలో చేర్చాల్సిన పరిస్థితి ఎదురయింది. ఏయూటీడీ సిబ్బంది చెప్పిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమబంగా సౌత్ 24 పరగనాస్ జిల్లా రాజ్‌పూర్ దరి బగుయుప్పర గ్రామానికి చెందిన విశ్వజిత్‌కి మానసిక వ్యాధి నయం కావడంతో వసతిగృహం సిబ్బంది ద్వారా శ్రద్ధా ఫౌండేషన్ సిబ్బంది 14 ఏళ్ల తర్వాత అతని అన్నయ్య అభిజిత్ బసక్‌కు అప్పగించారు. కాని అతన్ని ఇంట్లోకి రానిచ్చేందుకు ఆయన సోదరుడు నిరాకరించాడు. ఈ సందర్భంగా విశ్వజిత్ మాట్లాడుతూ తన సోదరుడు మొదటి నుంచి ఇంట్లో ఎవర్నీ పట్టించుకోలేదని విచారం వ్యక్తం చేశారు. అతని ఇష్టప్రకారమే పెళ్లి చేసుకున్నాడని గుర్తు చేశారు. భార్య, కుమారుడిని సైతం వదిలేసి ఎటో వెళ్లి పోయాడని తెలిపారు. దీంతో శ్రద్ధా ఫౌండేషన్ సిబ్బంది, సోషల్ వర్కర్ బికాస్ కుమార్ రజక్ విశ్వజిత్‌ను కోల్‌కతాలోని సద్గురు కృప అప్నాఘర్ ఆశ్రమంలో చేర్పించారు.



విశ్వజిత్‌ను ఆశ్రమంలో చేర్పిస్తున్న శ్రద్ధా ఫౌండేషన్ సిబ్బంది



జితేంద్రప్రసాద్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా ఫౌండేషన్ సిబ్బంది

అయోడిన్ లోపంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు తదితరులు

మహారాణిపేట: అయోడిన్ లోపం రుగ్మతల నివారణ దినోత్సవం 2024 కార్యక్రమాన్ని శుక్రవారం పలు ప్రాంతాల్లో నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ అయోడిన్ వారోత్సవాలు ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. చక్కటి ఆరోగ్యం కోసం రోజుకు ఒక స్పూన్ కంటే ఎక్కువ అయోడిన్ ఉప్పు వాడరాదని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులు అయోడైజ్డ్ ఉప్పు ఉపయోగాల గురించి వివరించారు. అయోడిన్ లోపం రుగ్మతుల నివారణ దినోత్సవం సందర్భంగా వాంబే కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోను, సునీల్ శర్మ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు కల్పించారు. వ్యాధుల ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.వి.సమత, ఇతర ప్రోగ్రాం అధికారులు, ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సుస్మిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాణిపేట సీఐ బాధ్యతల స్వీకరణ



డీసీపీ డాక్టర్ అజితను కలిసిన సీఐ భాస్కరరావు

అల్లిపురం: మహారాణిపేట సీఐగా బాసి భాస్కరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన డీసీపీ డాక్టర్ అజితను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈయన వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఆయనను మహారాణిపేట సీఐగా బదిలీ చేశారు.

'ఎంత పని చేశావ్ చంటి' చిత్ర యూనిట్ సందడి



సందడి చేస్తున్న చిత్ర యూనిట్ సభ్యులు

డాబాగార్డెన్స్: పీజేకే మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ ఉలిశెట్టి హీరోగా, శాంతిప్రియ హీరోయిన్‌గా ఉదయ్‌కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించిన చిత్రం ఎంత పని చేశావ్ చంటి. ఆ చిత్ర యూనిట్ శుక్రవారం వెంకటేశ్వర థియేటర్ వద్ద సందడి చేసింది. సినిమా విడుదల సందర్భంగా హీరో శ్రీనివాస్, దర్శకుడు ఉదయ్‌కుమార్, హీరోయిన్లు నిహారిక, శాంతి ప్రియ, ఇతర నటీనటులు ప్రేక్షకులతో కలిసి సినిమా వీక్షించారు. ఈ సందర్భంగా హీరో శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ తొలి రోజే ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. దియారాజ్, నిహారిక కేశవ్, శాంతి ప్రియ, పటాన్ జిలాన్ ఖాన్, జీవీ త్రినాథ్, అమ్మరాజు, భాస్కరాచారి పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే వ్యాధుల నివారణ

అల్లిపురం: వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు ప్రజలకు వివరించారు. జాగ్రత్తలతోనే డెంగ్యూ, మలేరియా వ్యాధులను నివారించవచ్చన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కుమ్మరవీధిలో మలేరియా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని సూచించారు. దోమ లార్వాలు అభివృద్ధి చెందే మొక్కల గోలాల్లో నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని, గదిలోకి గాలి, వెలుతురు వచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, కిటికీలు, ద్వారాలకు దోమ తెరలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంటి ఆవరణలో వాడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అనుమానం ఉన్నవారి నుంచి రక్తన మూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఆశ వర్కర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీబాల వీరాంజనేయ స్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్

మహారాణిపేట: వివిధ కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం విశాఖ విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామికి కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ స్వాగతం పలికారు. గురువారం రాత్రి నగరానికి చేరుకున్న మంత్రి రాత్రి స్థానిక సర్క్యూట్ హౌస్‌లో బస చేయగా ఆయనను కలెక్టర్ శుక్రవారం ఉదయం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కేజీహెచ్ అభివృద్ధికి కృషి..

జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిని శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జి మంత్రి ఆంధ్రా మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి కావడంతో డాక్టర్ శివానంద్ వెళ్లారు. కేజీహెచ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి వినతి..

మహారాణిపేట: మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోల శ్రీబాల వీరాంజనేయ స్వామికి ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు మైలపిల్లి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు, కోశాధికారి ఆర్జాల చిన్న, ఉపాధ్యక్షుడు కోనాడ చిన్న మంత్రికి వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



జేఎం నాయుడును సత్కరిస్తున్న నాయకులు, ఉద్యోగులు

డాబాగార్డెన్స్: పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జాగరపు మారునాయుడు (జేఎం నాయుడు)ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ ఆవిర్భావం నుంచి విశాఖ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీలో వివిధ హోదాలు నిర్వహిస్తూ ఇటీవల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకుని వాల్తేర్ డిపోలో గల అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జేఎం నాయుడు మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కార దిశగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు వి. రాధాకృష్ణ, జోనల్ సభ్యుడు శేఖర్, రీజినల్ అధ్యక్షుడు బీఏ రాజు, కార్యదర్శి కేవీ బాబు, రీజినల్ చైర్మన్ ఎం. ఈశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆర్. లోవరాజు, రీజినల్ కోశాధికారి ఎన్. వరహామూర్తి, అనకాపల్లి జిల్లా కార్యదర్శి టి. ఆంజనేయరాజు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

డాబాగార్డెన్స్: డిమాండ్ల పరిష్కారం కోరుతూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు శుక్రవారం డాబాగార్డెన్స్‌లో గల కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సమన్వయ కమిటీ నాయకులు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ యాజమాన్యం, ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల వేతన సవరణ, పెన్షన్ సవరణను తిరస్కరిస్తూనే ఉన్నాయన్నారు. ఏడేళ్లుగా వేతన సవరణ, పెన్షన్ సవరణ చేయకుండా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులతో తప్పుకుంటున్నాయని మండిపడ్డారు. ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్ల ఒత్తిడి మేరకు 4జీ కోసం టెండర్లు పిలిచి, ప్రభుత్వ రంగ సంస్థకు విదేశీ ఎక్విప్‌మెంట్ వాడొద్దని ప్రభుత్వం తిరస్కరించిందన్నారు. టీసీఎస్ కంపెనీకి ఆర్డర్ ఇచ్చి మూడేళ్లయినా, 4జీ ఎక్విప్‌మెంట్ సప్లై చేయలేకపోయిందన్నారు. క్యాజువల్ లేబర్‌కు బేసిక్ పే సవరించాలని డిమాండ్ చేశారు. సిటు నాయకుడు కుమార మంగళం, పి. లచ్చిరాజు, రామాంజనేయులు, మూర్తి, పీఈసీహెచ్‌వీ సాగర్, లక్ష్మీనారాయణ, గోవిందరావు, శ్యామల, చక్రి తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ఎక్సెల్సియార్ వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, కళాశాల సిబ్బంది

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఎక్సెల్సియార్ యువజనోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా కళాశాల పూర్వ విద్యార్థిని, గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైకాలజీ ప్రొఫెసర్ నళిని బిక్కిన పాల్గొన్నారు. ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఏ దేశంలో అయినా, ఏ రంగంలో అయినా ముందుంటారని తెలిపారు. దానికి ఆత్మవిశ్వాసం, స్వయం నిర్ణాయక శక్తి అవసరమని పేర్కొన్నారు. వేడుకల్లో విద్యార్థినులు నృత్య, సంగీత, చిత్రలేఖన, ఫొటోగ్రఫీ, ముకాభినయ, నాటక, ఏకపాత్రాభియ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. విజేతలకు ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుధ, ప్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ పి.కె.జయలక్ష్మి ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ టి.భాస్కరసుధ, సిస్టర్ మేరీ, నాన్సీ, డాక్టర్ మాణిక్యకుమారి, హరిణి, సోనీ, పవన్, డాక్టర్ లక్ష్మీ ప్రభ, ప్రమీల, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.